క్లుప్తంగా

ప్రైవేటు వ్యక్తుల పంట బీమాపై హెచ్చరిక

రోలుగుంట: ప్రైవేటు సంస్థలు పంట బీమా పేరిట మోసం చేస్తున్నాయని, జాగ్రత్తగా ఉండాలని ఏవో ఎస్.విజయలక్ష్మి రైతులను హెచ్చరించారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ కొన్ని సంస్థల నిర్వాహకులు గ్రామాల్లోకి వచ్చి మునగాకు పంట వేస్తే కొంటామని, డబ్బులు వసూలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. అటువంటి వాటిపై మండల వ్యవసాయశాఖ బాధ్యత వహించదని స్పష్టం చేశారు. రైతులు ఈ విషయాన్ని గమనించి గుర్తుతెలియని వ్యక్తుల వద్ద బీమా చేయించి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు.

ఆర్బీకేల్లో ఎరువులు సిద్ధం

రోలుగుంట: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు యూరియా, పొటాష్ తదితర ఎరువులను ఆర్బీకేల ద్వారా పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏవో ఎస్ విజయలక్ష్మి మాట్లాడుతూ రోలుగుంట ఆర్బీకే వద్ద యూరియా, నిండుగొండ ఆర్బీకే వద్ద పొటాష్ అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పుస్తకంతో వెళ్లి నమోదు చేయించుకుని తీసుకెళ్లాలన్నారు.

సారా విక్రేత అరెస్ట్

కశింకోట: మండలంలోని పేరంటాలపాలెంలో సారా విక్రయిస్తున్న ఆటో డ్రైవర్ పువ్వల సీతారాం(43)ను శుక్రవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు సీతారాం తన ఇంటి వద్ద లీటరు రూ.200 చొప్పున 5 లీటర్ల సారా విక్రయిస్తుండగా తమ స్టేషన్ హెచ్‌సీ టి.అప్పలకొండ, సిబ్బంది వెళ్లి పట్టుకున్నట్టు తెలిపారు.

నిల్వ నీటిని తొలగించాలి



ఎ.కోడూరులో నిల్వ నీటిని తొలగించే చర్యలపై అవగాహన కల్పిస్తున్న త్రినాథ్

కె.కోటపాడు: వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ తెలిపారు. శుక్రవారం ఎ.కోడూరులో ప్రజలకు దోమకాటు వల్ల వచ్చే డెంగ్యూ, మలేరియా వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో ఎక్కువ రోజు లుగా మురుగు ఉంచకుండా ప్రతీ వారం ఫ్రైడే డ్రైడేగా పాటించాలని సూచించారు. మురుగునీటిలో లార్వాను విడల్చడం వల్ల దోమల వృద్ధి పరిస్థితి ఉంటుందని త్రినాథ్ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం బి.సంతోషి కుమారి, ఎంఎల్‌హెచ్‌పీ శాంతి, ఆశా కార్యకర్త లు పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలి

మాకవరపాలెం: హైదరాబాద్‌లో వచ్చే నెల జరగనున్న మాదిగ విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత రుద్రపోగు సురేష్ కోరారు. శుక్రవారం సాయంత్రం కొండల అగ్రహారంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగలంతా సమష్టిగా సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధ్యక్షుడు మల్లిబాబు, నర్సీపట్నం నియోజకవర్గ కన్వీనర్ బిక్కవోలు ప్రసాద్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

నర్సీపట్నం: ఇళ్లు కాలిపోయిన బాధితులకు నర్సీపట్నానికి చెందిన పద్మశాలి సంక్షేమ సేవా సంఘం వారు శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల గ్యాస్ సిలిండర్ లీకై నాతవరం మండలం గునిపూడిలో ఇళ్లు కాలిపోయిన మూడు కుటుంబాలకు రూ.29 వేలు, నిత్యావసర సరకులు అందజేశారు. సంఘం అధ్యక్షు డు సూరిశెట్టి సూర్యనారాయణమూర్తి, కార్యదర్శి కాకి రాజేష్ కుమార్, కోశాధికారి కాద రామచంద్రరావు, గౌరవాధ్యక్షుడు వంకల మహేశ్వరరావు, సలహాదారులు మునుకోటి కృష్ణ, కోసూరి రామకృష్ణ, కమిటీ సభ్యులు తేలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష చరిత్రాత్మకం

- ఉచితంగా 11 రకాల ధ్రువపత్రాల జారీ
- తారువ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



తారువలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: సాంకేతిక కారణాలతో ఇప్పటి వరకు అందని వారికి సైతం సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. శుక్రవారం తారువలోని జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని 534 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పైసా రుసుం లేకుండా గ్రామాల్లో ప్రజల చెంతనే 11 రకాల కుల, ఆదాయ, ఆధార్, జనన, మరణ, కౌలు కార్డులు తదితర ధ్రువపత్రాలను అందజేయడం దేశ చరిత్రలోనే ప్రథమమని స్పష్టం చేశారు. పేదల సంక్షేమాభివృద్ధి కోసం నిత్యం పరితపిస్తున్న సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జెడ్పీ స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఈర్లె అనురాధ, ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, మహిళా అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, సర్పంచ్ గొంప వరహాలమ్మ, ఎంపీటీసీ అవుగడ్డ రమాదేవి, డీఎల్‌డీవో మంజులవాణి, తహసీల్దార్ ఎం. లక్ష్మి, ఉప సర్పంచ్ బూడి సూర్యనారాయణ, మాజీ ఎంపీటీసీ మలిరెడ్డి మహాలక్ష్మినాయుడు, పంచాయతీ సెక్రటరీ పి. అప్పలనాయుడు పాల్గొన్నారు.

వేలాది కుటుంబాలకు మేలు

గొలుగొండ: జగనన్న సురక్షతో వేలాది కుటుంబాలకు ఎంతో మేలు కలుగుతుందని జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యన్నారాయణ తెలిపారు. శుక్రవారం పాతమల్లంపేట, జోగుంపేట గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ రెండు పంచాయతీల్లో 869 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, ఎంపీపీ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని కోరారు. వైస్ ఎంపీపీ జక్కు నాగమణి, సర్పంచ్‌లు జువ్వల లక్ష్మి, మామిడి ఆదిలక్ష్మి, తహసీల్దార్ ఆనందరావు, ఎంపీడీవో దేవిడ్‌రాజు, యూత్ పార్టీ మండలాధ్యక్షుడు రామకృష్ణనాయుడు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నల్లబెల్లి శ్రీను పాల్గొన్నారు.

ఉచిత సేవలందించే ప్రభుత్వంపై ఆలోచించండి

నాతవరం: జగనన్న సురక్ష ద్వారా ఇంటి వద్దకే ఉచితంగా సేవలందిస్తున్న విషయాన్ని ప్రజలంతా గ్రహించాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. పెదగొలుగొండపేట శృంగవరం పంచాయతీల్లో సురక్ష గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ఈ ప్రాంత అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారన్నారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో హనుమంతరావు, తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు, సర్పంచ్‌లు మిరపల వెంకటరమణ, ఉలబాల యర్రయమ్మ, ఎంపీటీసీ తమరాన సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు ఉలబాల శ్రీనువాస్, గృహ సారథులు మండల కన్వీనర్ అడిగర్ల నాయుడు, రైతు విభాగం మండలాధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, ఈవోపీఆర్డీ చినబాబు, డిప్యూటీ తహసీల్దార్ చైన్లు పాల్గొన్నారు.

అర్హత కలిగిన వారు నష్టపోకూడదని...

చీడికాడ: ఖండివరంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 892 మందికి ధ్రువపత్రాలను మండల ప్రత్యేకాధికారి డి.మహేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన వారు నష్టపోకూడదని ప్రతి ఇంటికి వలంటీర్లు వెళ్లి వారికి అవసరమైన ధ్రువపత్రాల వివరాలు సేకరించి అందిస్తున్నామన్నారు. తహసీల్దారు బి.వి.రాణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కురచా నారాయణమూర్తి, సర్పంచ్ శీరంరెడ్డి లక్ష్మి, ఎంపీటీసీ గెంజి స్వాతి బాలాజీ, ఎంపీడీవో జయప్రకాష్, మండల సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య, నాయకులు మోసూరి సన్నిబాబు, సుంకర శ్రీను, షేకు సూర్యనారాయణ, సింగంపల్లి ముత్యాలనాయుడు, అమ్మతల్లినాయుడు పాల్గొన్నారు.

2,967 అర్జీల పరిష్కారం

రావికమతం: జగనన్న సురక్ష గ్రామ సభలు శుక్రవారం రెండు గ్రామ సచివాలయాల్లో నిర్వహించారు. గుడివాడలో 2,074, చినపాచిలలో 893 అర్జీలను పరిష్కరించి ధ్రువపత్రాలందించారు. చినపాచిలలోని కార్యక్రమంలో తహసీల్దార్ మహేశ్వరరావు, గుమ్మాళ్లపాడు సర్పంచ్ బంటు సన్యాసినాయుడు, ఎంపీటీసీ బంటు శ్రీను, గుడివాడ సదస్సులో ఎంపీడీవో వెంకన్నబాబు, సర్పంచ్ శంకర్, ఎంపీటీసీ కర్సం అప్పారావు పాల్గొని లబ్ధిదారులకు వీటిని పంపిణీ చేశారు.



గొలుగొండ: పాతమల్లంపేటలో సర్టిఫికెట్లు అందిస్తున్న జెడ్పీటీసీ, అధికారులు



రావికమతం: చినపాచిలలో ధ్రువపత్రాలందిస్తున్న దృశ్యం

2,140 అర్జీలు పరిష్కారం

చోడవరం: మండలంలో లక్ష్మీపురం, భోగాపురం గ్రామ సచివాలయాల్లో శుక్రవారం జగనన్న సురక్ష గ్రామసభలు జరిగాయి. ఈ సభల్లో పాల్గొన్న తహసీల్దార్ తిరుమలరావు 2140 అర్జీలను పరిష్కరించారు. ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో చైతన్య, ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు, మండల పరిషత్ సూపరింటెండెంట్ అమ్మాజీ, సర్పంచ్‌లు శిరుచోళ్ల గణపతినాయుడు, బలిరెడ్డి నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు బైన కుమారిఈశ్వరరావు, జగ్గారావు, ఎంపీటీసీలు ఆడారి కోటిభూలోక, సంద్ర వీరన్న, షేక్ అబ్దుల్ రహమాన్ పాల్గొన్నారు.

గురుకులానికి రూ.35 కోట్లు మంజూరుపై హర్షం

- సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఏటి అవతల గ్రామాల ప్రజాప్రతినిధులు

చోడవరం: జన్నవరంలో జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలకు రూ. 35 కోట్లు మంజూరుపై ఏటి అవతల గ్రామాల ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృతజ్ఞత తెలుపుతూ శుక్రవారం జన్నవరం పీఏసీఎస్ ఆవరణంలో సీఎం జగన్, స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఇప్పటి వరకూ గత ప్రభుత్వాలు నిర్లక్ష్యంతో తమ గ్రామాలను పూర్తిగా విస్మరించాయని, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక మంచి రోజులు వచ్చాయని ఏటి అవతల గ్రామాల సర్పంచ్‌లు మూడెడ్ల శంకరరావు, పోతల జానకీప్రసాద్, సన్యాసిరావు, వైస్ ఎంపీపీ బైన కుమారిఈశ్వరరావు, తదితరులు ఆనందం వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాల ఏర్పాటు ద్వారా తమ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నేడు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

కె.కోటపాడు: చౌడువాడ పీహెచ్‌సీ పరిధిలోని ఆరోగ్య ఉప కేంద్రాల్లో శనివారం చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు వేయనున్నట్లు వైద్యాధికారి నిర్మల తెలిపారు. 0–5 ఏళ్లలోపు చిన్నారులతో పాటు గర్భిణులకు ధనుర్వాతం రాకుండా టీకాలను వేయనున్నట్లు పేర్కొన్నారు.

సచివాలయ వ్యవస్థతో నిరుపేదలకు న్యాయం

గడపగడపలో డిప్యూటీ సీఎం బూడి



మహిళలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి

చీడికాడ: అర్హతను గుర్తించి నిరుపేదలకు న్యాయం చేయడానికే వలంటీర్లు, గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పడిందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. శుక్రవారం అడువుల అగ్రహారంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి జగనన్న సంక్షేమ పాలనకు సంబంధించి బుక్‌లెట్లు అందిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిలో కొన్నిటిని అక్కడికక్కడే పరిష్కరించారు. సంక్షేమ లబ్ధిని వివరించారు. గ్రామంలో రూ.45 లక్షలతో ఏర్పాటు చేసిన ఇంటింటికీ కుళాయి తాగునీటి సరఫరాను పరిశీలించారు. ఈ విషయమై మహిళలను ఆరా తీశారు. అభివృద్ధి పనులకు రూ.10 లక్షల గడపగడప నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని, ఎంపీపీ పాఠశాలను పరిశీలించారు. అక్కడ చిన్నారులతో ముచ్చటించారు. గర్భిణులకు సీమంతాలు చేసి దీవించారు. పిల్లలకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సలాది ధనలక్ష్మి, ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు గొల్లవిల్లి రాజుబాబు, యూత్ అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, నాయకులు సలాది గంగశేషు, సన్యాసిరావు, తహసీల్దార్ బి.వి.రాణి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గడపగడపలో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మున్సిపాలిటీ 10వ వార్డు పెదబొడ్డేపల్లిలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యేకు వార్డు నాయకులు, వలంటీర్లు థాంక్యూ సీఎం, థాంక్యూ ఎమ్మెల్యే అంటూ ప్ల కార్డులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వార్డులో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులం, మతం, రాజకీయాలకు అతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అర్హత ఉంటే చాలు పక్కా గృహాలు, ఇళ్ల స్థలాలు, తదితర సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, వార్డు ఇన్‌చార్జి చీటిల రాము, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకాశివ, మహిళా విభాగం టౌన్ అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఉన్నీసాబేగం, అర్జున్, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, పార్టీ సీనియర్ నాయకుడు గుడివాడ లచ్చబాబు, మున్సిపల్ కమిషనర్ కనకారావు, ఆర్‌ఐ వెంకటలక్ష్మి, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా సర్వే

తారువలో పరిశీలించిన తహసీల్దార్ లక్ష్మి



తారువలో ఇంటింటా ఓటర్ల సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ లక్ష్మి

దేవరాపల్లి: మండలంలో ఓటరు జాబితా ఇంటింటా సర్వే పారదర్శకంగా నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఎం. లక్ష్మి తెలిపారు. మండలంలో శుక్రవారం నుంచి ప్రారంభమైన ఈ సర్వేను ఆమె తారువలో పర్యవేక్షించారు. మండలంలోని 57 పోలింగ్ బూత్‌లకు సంబంధించి ఓటర్ల జాబితా సర్వే వచ్చే నెల 21తో ముగుస్తుందన్నారు. ప్రతీ బీఎల్వో తమకు నిర్దేశించిన ఇళ్లకు వెళ్లి సర్వేను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. ఈ సర్వేలో తప్పులను సరి చేయడంతోపాటు ఓటు హక్కు కోల్పోయిన వారు, మరణించిన వారు పేర్లు ఓటరు జాబితాలో ఉన్నా, ఓటు హక్కు పొందకుండా ఉండిపోయిన వారు వివరాలను ఎన్నికల కమిషన్ యాప్‌లో నమోదు చేయాలన్నారు.



సర్వేను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడు

బోగస్ ఓట్ల ప్రసక్తే లేదు

నాతవరం: మండల వ్యాప్తంగా ఎక్కడా బోగస్ ఓట్లు ప్రసక్తే లేదని తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాస్‌నాయుడు తెలిపారు. నాతవరం, శృంగవరం, గాంధీనగరం, మర్రిపాలెం గ్రామాల్లో బీఎల్వోలు చేపట్టిన ఓటర్ల జాబితా ఇంటింటా సర్వేను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేశారు. మండలంలో 65 పోలింగ్ కేంద్రాల్లో 52,648 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ప్రస్తుత సర్వేలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తామన్నారు. మరణించిన ఓటర్లు, ఇతర ప్రాంతాలకు వలసపోయిన వారిని నిబంధనల ప్రకారం తొలగిస్తామన్నారు. ఇంటింటా సర్వే పర్యవేక్షణ కోసం ఆరుగురు సూపర్‌వైజర్లు నియమించామన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ



గోవుకు పూజలు చేస్తున్న మహిళలు

మాకవరపాలెం: మహిళలు భక్తిశ్రద్ధలతో గోపూజలు చేశారు. అధిక శ్రావణమాసం పురస్కరించుకుని శుక్రవారం స్థానిక రామాలయం వద్ద సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో గ్రామ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గోవు చుట్టూ ప్రదక్షిణలు చేసి పూజలు చేశారు. ఫౌండేషన్ ప్రచారకర్త కేతవరపు రత్నమాల, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత



గర్భిణులతో మాట్లాడుతున్న వైద్యాధికారి శ్రీవిద్య

మాకవరపాలెం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి శ్రీవిద్య సూచించారు. ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా రాచపల్లి గ్రామ సచివాలయంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారితోపాటు గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేశారు. పాఠశాలలోని విద్యార్థులను పరీక్షించి వ్యాధులతో బాధపడేవారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. వీటిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటకు బస్సు సర్వీస్ ప్రారంభం



బుచ్చెయ్యపేటకు వచ్చిన ఆర్టీసీ బస్సు

బుచ్చెయ్యపేట: ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చొరవతో ఎట్టకేలకు బుచ్చెయ్యపేట ప్రజలకు ఆర్టీసీ బస్సు కల నెరవేరింది. ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల ప్రజలు, అధికారులు మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సు సర్వీస్ ఏర్పాటు చేయాలని విప్ ధర్మశ్రీని కోరారు. ఆయన ఆదేశాలతో విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి శుక్రవారం బుచ్చెయ్యపేటకు 300బి నంబర్ బస్సును అధికారులు ఏర్పాటు చేశారు. రోజూ ఉదయం 6.10 గంటలకు విశాఖలో బయలుదేరి 8.20 గంటలకు బుచ్చెయ్యపేటకు చేరుతుంది. తిరిగి ఇక్కడ 8.25 గంటలకు బయలుదేరి 10.45 గంటలకు చేరుతుంది. ప్రయాణికుల రద్దీని బట్టి రోజుకు ఎక్కువ ట్రిప్పులు నడుపుతామని విశాఖ ఆర్టీసీ సిబ్బంది తెలిపారు. ఇప్పటి వరకు మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సు సదుపాయం లేక అవస్థలు పడుతున్న ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గోడ కూల్చివేతను అడ్డుకున్న గ్రామస్తులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఈ నాగ మోహన్‌రావు

బుచ్చెయ్యపేట: భీమునిపట్నం, నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో బంగారుమెట్ట, ఎల్బీపురం గ్రామాల మధ్యన గెడ్డ గోర్జు గోడ కూల్చివేతను రెండు గ్రామాల ప్రజలు అడ్డుకున్నారు. ఇటీవల ఈ రెండు గ్రామాల మధ్యన రియల్ ఎస్టేట్ వ్యాపారి భూమిని కొనుగోలు చేసి లే అవుట్లు వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాడు. తన లే అవుట్లకు గోర్జు గోడ అడ్డంగా ఉందని అధికారులతో మాట్లాడినట్టు గ్రామస్తులు గుర్తించారు. శుక్రవారం సాయంత్రం గోడను తీయడానికి వచ్చిన జేసీబీని వారు అడ్డుకున్నారు. దీంతో ఆర్అండ్‌బీ డీఈ నాగ మోహనరావు అక్కడకు చేరుకుని చర్చించారు. బీఎన్ రోడ్డు విస్తరణలో భాగంగా తీసేసి గ్రామం ఉన్నంత వరకు సీసీరోడ్డు, కాలువ ఏర్పాటు చేస్తామని వివరించారు. గోడ తీసేస్తే గ్రామంలోకి వర్షపు నీరు వచ్చి ముంపునకు గురవుతుందని డీఈ వద్ద వాపోయారు. దీంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు.

జగనన్న సురక్షతో ప్రజలకు సత్వర సేవ



సింగన్నదొరపాలెంలో ధ్రువపత్రాలను అందిస్తున్న అనురాధ, జగన్‌మోహన్

కె.కోటపాడు: జగనన్న సురక్ష ద్వారా సత్వర సేవలు అందనున్నట్లు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అన్నారు. శుక్రవారం రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష సమావేశాలు జరిగాయి. సింగన్నదొరపాలెంలో 264, సూదివలస 349 మంది లబ్ధిదారులకు వారు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, ఎంపీడీవో శచీదేవి, తహసీల్దార్ జె.రమేష్‌బాబు, డీటీ రమేష్, ఈవో పీఆర్డీ ప్రసాద్, సర్పంచ్‌లు ఆదిరెడ్డి సన్యాసినాయుడు, జామి శ్రావణ్, గంతకర్ల చినతల్లి, ఎంపీటీసీ వర్రి రామునాయుడు, రొంగలి లక్ష్మి, సచివాలయ మండల కన్వీనర్ ఏటుకూరి రాజేష్ పాల్గొన్నారు.

దమ్ములు ప్రారంభం



దారగెడ్డ దిగువున దమ్ము పట్టిన పొలం

గొలుగొండ: మండలంలో దారగెడ్డ దిగువున వరినాట్లు వేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు ఇందుకు అనుకూలంగా మారింది. ఈ మేరకు శుక్రవారం నుంచి దారగెడ్డ దిగువున దమ్ములు పట్టే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. మరో వారం రోజుల్లో అన్ని ప్రాంతాల్లో వరినాట్లు మొదలు కానున్నాయి. గతేడాది కంటే ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో వరినాట్లు పడతాయని అంచనా వేస్తున్నారు.

అదనపు సబ్ స్టేషన్ నిర్మాణానికి వినతి

చోడవరం రూరల్: లో వోల్టేజీతోపాటు ఇతర విద్యుత్ సరఫరా సమస్యలను అధిగమించడానికి వీలుగా చోడవరంలో అదనపు సబ్ స్టేషన్ నిర్మించాలని ఏపీ రైతు కూలీ సంఘం ప్లకార్డులు చేతబూని డిమాండ్ చేసింది. శుక్రవారం విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్, రిటైర్డ్ జడ్జి బి.సత్యనారాయణ అధ్యక్షతన పట్టణంలో వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు, జిల్లా సహాయ కార్యదర్శి కిల్లి దేముడు, సభ్యులు కానూరి జగదీశ్వరరావు, లెక్కల వెంకటరమణ తదితరులు మండలంలో విద్యుత్ వెతలను ఫోరమ్ దృష్టికి తీసుకు వచ్చారు. నర్సయ్యపేట వద్ద అదనపు సబ్ స్టేషన్ నిర్మాణ పనులు ఇప్పటికీ చేపట్టలేదని వాపోయారు.

త్వరితగతిన భవన నిర్మాణాలు

జెడ్పీ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ



ఏటికొప్పాక జెడ్పీ హైస్కూల్ భవనాలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈవో సత్యనారాయణ

యలమంచిలి: భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని జెడ్పీ డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణ అన్నారు. మండలంలో ఏటికొప్పాకలో రూ.6 లక్షల జెడ్పీ నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సచివాలయ కాంపౌండ్ వాల్, మరి కొన్ని ప్రజా అవసరాల భవనాల నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న సచివాలయంలో మౌలిక వసతులపై స్థానిక మండల పరిషత్ అధికారులతో చర్చించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాలను పరిశీలించారు.అంగన్‌వాడీ కేంద్రంలో మౌలిక వసతులపై స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం లక్కబొమ్మల సొసైటీని సందర్శించి, కళాకారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల పరిపాలనాధికారి ప్రసాదరావు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి సోమశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకుడు సేనాపతి రాము తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మునగపాక: ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్థానిక పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. ప్రధాన రహదారిపై ఎటువంటి రికార్డులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్ వద్ద సరైన ఆధారాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఆలీ తెలిపారు.